సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

'వేమలి'కి కందుకూరి రంగస్థల విశిష్ట పురస్కారం



విశిష్ట పురస్కారం స్వీకరిస్తున్న డాక్టర్ వేమలి త్రినాథరావు

మద్దిలపాలెం: నగరానికి చెందిన నాటక రంగ ప్రముఖుడు డాక్టర్ వేమలి త్రినాథరావుకు ప్రతిష్టాత్మకమైన కందుకూరి రంగస్థల విశిష్ట పురస్కారం లభించింది. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఇటీవల విజయవాడలో జరిగిన తెలుగు నాటకరంగ దినోత్సవంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణల చేతుల మీదుగా పురస్కారాన్ని తాను స్వీకరించినట్లు వేమలి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను పలువురు నాటక ప్రముఖులు అభినందించారు.

రూ.1.10 కోట్ల మోసం

బీచ్‌రోడ్డు: వ్యాపార విస్తరణకు సహకరిస్తానని చెప్పి రూ.1.10 కోట్లు మోసం చేసిన ఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాండురంగాపురానికి చెందిన నల్లీ మారి అనే వ్యక్తి కాస్మోటిక్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి దేముడు అనే వ్యక్తితో పరిచయమైంది. తన కాస్మోటిక్స్ వ్యాపారం విస్తరించాలని దేముడికి చెప్పగా.. అతడు సహకరిస్తానని చెప్పి దఫదఫాలుగా రూ.1.10 కోట్లను తీసుకున్నాడు. కొన్ని రోజులుగా దేముడు స్పందించడం లేదని, తన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని పోలీస్ స్టేషన్‌లో మారి ఫిర్యాదు చేశాడు. సీఐ పైడయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చందనోత్సవంలో బాలలకు సౌకర్యాలు కల్పించాలి

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వచ్చే బాలలకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. చిన్నారులకు వారి తల్లులు పాలు పట్టేందుకు వీలుగా క్యూల్లో తగినన్ని ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. బాలలకు మంచి నీరు, వేడి పాలు, బిస్కెట్లు అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దివ్యాంగ పిల్లలకు ప్రత్యేకంగా దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన పిల్లలను త్వరితగతిన వారి తల్లిదండ్రులకు అప్పగించేలా పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమశాఖ, చైల్డ్‌లైన్ సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు.

హజ్ యాత్రికులకు వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం హజ్ యాత్రికుల కోసం అవగాహన, వైద్య శిబిరం నిర్వహించారు. హజ్ కమిటీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ, విజయనగరం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన 66 మంది యాత్రికులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి. లూసి కొర్డీలియా (డీఐవో, విశాఖపట్నం), డాక్టర్ కె.ఎస్.రోష్ని (అసిస్టెంట్ ప్రొఫెసర్, కేజీహెచ్), డాక్టర్ ఎ.ఉషా (పిల్లల వైద్యులు), డాక్టర్ బి.ఎం.ప్రవీణ్య (మహాజశల వైద్యులు), డాక్టర్ ఎస్.శ్రీనివాస్ (జనరల్ డాక్టర్), రైల్వే న్యూకాలనీ, నరసింహనగర్ యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, హజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 10 వినతులు



తహసీల్దార్ రమేష్‌కు సమస్యలు విన్నవిస్తున్న అర్జీదారులు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.రమేష్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు స్థానికులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ప్రేమలత, వీఆర్‌వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆట పరికరాలిలా.. ఆడుకునేదెలా..?



జీవీఎంసీ చినవాల్తేర్ పిల్లల పార్కులో సౌకర్యాలు నిల్

- మూలకు చేరిన ఆట వస్తువులు
- పార్క్‌నిండా వ్యర్థాలు, డెబ్రిస్ కుప్పలు
- చిన్నారుల్లో నిరుత్సాహం

ఏయూక్యాంపస్: పిల్లల పార్కు అంటే ఎంతో అందంగా.. ఆహ్లాదంగా ఉంటుంది. అనేక ఆట వస్తువులు, పరిశుభ్రమైన వాతావరణం మనం కోరుకుంటాం. ఇక్కడి పరిస్థితులు మాత్రం దీనిని పూర్తిగా విరుద్ధంగా దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ చినవాల్తేర్ పిల్లల పార్కు దీనికి నిదర్శనం. ఇక్కడి అధ్వాన పరిస్థితులను పరిశీలిస్తే పిల్లలను పార్క్‌కు పంపడానికి తల్లిదండ్రులు ఆలోచించాల్సిందే. ఇక్కడ చుట్టుపక్కల నివసిస్తున్న అనేక కుటుంబాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో చిన్నారులు ఆడుకోవడానికి ఈ పార్కుకు వస్తుంటారు. కొన్నేళ్ల కిందట అభివృద్ధి చేసి.. ఆధునీకరించిన చినవాల్తేర్ చిల్డ్రన్స్ పార్క్ పూర్తిగా దెబ్బతిని కళావిహీనంగా మారింది.



జీవీఎంసీ చినవాల్తేర్ పిల్లల పార్కు

పరిశుభ్రత కనుమరుగు



పార్కులో అపరిశుభ్రంగా పరిసరాలు, పేరుకుపోయిన వ్యర్థాలు

చిన్నారుల పార్కులో మచ్చుకైనా పరిశుభ్రత కనిపించడం లేదు. చెట్ల ఆకులు, కవర్లు ఎక్కడికక్కడే దర్శనమిస్తున్నాయి. వీటిని పార్క్‌లో ఒక మూలకు తోసేయడం, అక్కడే నిప్పు పెడుతున్నట్లు గోడలు చూస్తే ఇట్టే అర్థమవుతుంది. పార్క్‌లో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు విరిగిపోయి నిరుపయోగంగా మారాయి.

ఆట వస్తువులు శిథిలం



మూలకు చేరిన ఊయల

ఈ పార్కులోని ఆట పరికరాలు శిథిలావస్థకు చేరాయి. జారుడు బల్లకు భారీ రంధ్రం పడింది. పొరపాటున దీనిపై జారితే గాయపడే అవకాశం ఉంది. ఊయలలు పూర్తిగా పాడయ్యాయి. కేవలం ఇనుప చైన్‌లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, మరమ్మతులు చేపట్టడం ఎంతో అవసరం.

మైదానం.. ఘోరం



పెచ్చులూడిన మైదానం ఫ్లోరింగ్

పార్కులోని ఖాళీ స్థలంలో షటిల్ కోర్ట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీని ఆనవాళ్లు సైతం లేని పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. చిన్నారులకు గాయాలు కాకుండా ప్రత్యేకమైన ఫ్లోరింగ్ వేశారు. ప్రస్తుతం ఇది పూర్తిగా దెబ్బతింది. పెచ్చులూడిపోయి మైదానం నిరుపయోగంగా మారింది. ఈ ప్రాంతంలోనే చిన్నారులు, యువకులు నిత్యం ఆటలాడుతున్నారు.

ఓపెన్ జిమ్ పరికరాలే దిక్కు



విరిగిన జారుడు బల్ల

ఇదే పార్క్ ఆవరణలో పెద్దల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఆట వస్తువులు దెబ్బతినడంతో చిన్నారులంతా ఓపెన్ జిమ్ పరికరాలతోనే ఆడుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఓపెన్ జిమ్ పరికరాల్లో సైతం కొన్ని దెబ్బతిన్నాయి. చిన్నారులు వీటిపై ఆడితే గీసుకుని, దెబ్బలు తినే పరిస్థితి ఎదురవుతోంది. వేసవి సెలవుల్లో చిన్నారులు పార్క్‌లో గడపడానికి ఆసక్తి చూపుతారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో కాసేపు ఆడుకోవడానికి ఇష్టపడతారు. ఇటువంటి సమయంలో ఈ పార్కును అభివృద్ధి చేస్తే చిన్నారులకు కాస్త ఆటవిడుపుగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

ఇరువర్గాల మధ్య స్థల వివాదం



స్థలం కోసం వాగ్వాదం చేస్తున్న ఇరువర్గాలు



వెటర్నరీ కాలనీలో వివాదాస్పద స్థలం

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షి నగర్‌లో కొత్తగా ఏర్పాటైన వెటర్నరీ కాలనీలోని ఓ స్థలం వ్యవహారం వివాదంగా మారింది. ఆ స్థలం మాదంటే.. మాదంటూ ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఆరిలోవ పోలీసులు కలుగుచేసుకొని ఇరువర్గాల వారిని డాక్యుమెంట్లతో పోలీస్ స్టేషన్‌కు రావాలని ఆదేశించడంతో వివాదం సద్దుమనిగింది. ఈ ప్రాంతంలో సర్వే నంబర్ 133/8 పశు సంవర్ధక శాఖకు చెందిన సుమారు 30 ఎకరాలకు పైగా స్థలం ఉండేది. దానిలో 18.78 ఎకరాల స్థలాన్ని పశు సంవర్ధక శాఖ వైద్యుల నివాస స్థలాలకు ప్రభుత్వం కొన్నేళ్ల కిందట కేటాయించింది. మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఇక్కడ వెటర్నరీ లేఅవుట్‌ను ఆనుకొని ఆ ఖాళీ స్థలంలో సుమారు 46 సెంట్లు తమ తాతలకు ప్రభుత్వం బారిక మాన్యం కింద 1956లో ఇచ్చిందని, వారి వారుసలమంటూ కొందరు ఆ స్థలాన్ని సోమవారం పొక్లెయిన్‌తో చదును చేయించే పనులు చేపట్టారు. ఆ స్థలం 134 సర్వే నంబర్‌లో ఉన్నట్లు తెలుపుతున్నారు. ఆ స్థలం 133/8 లోనిదని, పశు సంవర్ధక శాఖకు చెందినదంటూ వెటర్నరీ వైద్యులు ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ సూచనలతో అక్కడ జరుగుతున్న పనులను అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకొంది. పశు సంవర్ధక శాఖ అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కృష్ణ, కానిస్టేబుళ్లతో స్థలం వద్దకు చేరుకుని పనులు నిలిపేశారు. ఇరువురిని వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు తీసుకొని పోలీస్ స్టేషన్‌కు రావాలన్నారు. వారిరువురి వద్ద ఉన్న డాక్యుమెంట్లను రెవెన్యూ అధికారులకు పంపిస్తామని చెప్పారు. ఆ స్థలం ఎవరికి చెందినదో రెవెన్యూ అధికారులు నిర్ధారిస్తారని, అంతవరకు ఎవరూ అక్కడ పనులు చేపట్టకూడదని హెచ్చరించారు. దీంతో వివాదం సద్దుమనిగింది. ఇదిలా ఉండగా.. ఇక్కడ భూమి ధరలను బట్టి స్థలం విలువ రూ.20 కోట్లకు పైగా ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను హైస్కూళ్లలో చేర్పించండి



శ్రీకృష్ణాపురం పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్ఎం పైడిరాజు

ఆరిలోవ: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థులను ప్రభుత్వ హైస్కూళ్లలో చేర్చడానికి విద్యా శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ బాధ్యతలను ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. ఐదో తరగతి పిల్లలను హైస్కూల్‌లో ఆరో తరగతిలో చేర్పించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం ఇమంది పైడిరాజు వారి పరిధిలోని పైనాపిల్ కాలనీ, ఆరిలోవ కాలనీ, రామకృష్ణాపురం, దీన్‌దయాల్‌పురం, శ్రీకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అక్కడి ఐదో తరగతి విద్యార్థులను అడవివరం ఉన్నత పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని కోరారు.

గ్రంథాలయ, పీఆర్వో ఉద్యోగాల భర్తీకి వినతి



ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

ఎంవీపీకాలనీ: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా ఖాళీగా ఉన్న గ్రంథాలయాధికారులు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్(పీఆర్వో) పోస్టులను భర్తీ చేయాలని పలువురు నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును ఎంవీపీ కాలనీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు డాక్టర్ దంతేశ్వర్ పట్నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దశాబ్దాలుగా గ్రంథాలయాధికారులు, పీఆర్వోల పోస్టులను భర్తీ చేయాలేదన్నారు. దీంతో బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీ, ఎంజేఎంసీ కోర్సులు చేసిన ఎంతో మంది యువత నిరుద్యోగులుగా మారారని తెలిపారు. జిల్లాల వారీగా అనేక గ్రంథాలయాల్లో గ్రంథాలయాధికారి పోస్టులు, మండల, జిల్లా స్థాయిలో పీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయా పోస్టుల భర్తీకి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ చిరంజీవిరావును కోరినట్లు చెప్పారు. సూర్యనారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



పర్యాటక ప్రాంత ఫొటోగ్రాఫర్లకు సూచనలిస్తున్న త్రీ టౌన్ సీఐ పైడయ్య

బీచ్‌రోడ్డు: పర్యాటక ప్రాంతాల సందర్శనకు వస్తున్న వారికి ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫొటోగ్రాఫర్లను మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పైడయ్య హెచ్చరించారు. పర్యాటక ప్రాంతాల్లో ఉన్న ఫొటోగ్రాఫర్లతో సోమవారం బీచ్ రోడ్డులోని వైఎంసీఏలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అలా కాకుండా పర్యాటకులను బెదిరించడం, వారి స్వేచ్ఛకు భంగం కలిగించడం వంటి పనులు చేస్తే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

1 నుంచి బాలల శిబిరం

ఏయూక్యాంపస్: గాయత్రి విద్యా పరిషత్ ఎం.ఎల్.బి.టి. స్కూల్‌లో మే 1 నుంచి బాలల విజ్ఞాన వికాస శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.మధురవాణి ఒక ప్రకటనలో తెలిపారు. బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్ ఎదురుగా ఉన్న ఈ పాఠశాలలో శిబిరం జరుగుతుందన్నారు. భారతీయ ఇతిహాసాలైన రామాయణ, భాగవత గ్రంథాలు, కథలు, పద్యాల రూపంలో అందిస్తామన్నారు. నగరంలోని బాలలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, ఆసక్తి గల వారు వివరాలకు 94937 89089 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సంకీర్తన పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విజేతలతో ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు తదితరులు

సీతంపేట: శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన అన్నమాచార్య సంకీర్తన పోటీల విజేతల బహుమతి ప్రదానోత్సవం సోమవారం జరిగింది. ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి అవతార విశిష్టతను అన్నమాచార్యులు సంకీర్తనా రూపంలో భక్తులకు తెలియజేశారన్నారు. విద్యార్థులు సంగీతంతోపాటు చదువులోనూ రాణించాలని సూచించారు. శృతిలయ సంస్థ చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రశంసించారు. అనంతరం ఆగమ పండితులు పి.రంగనాథ ఆచార్యులు, వీటిలీ బ్యూరో ఎంఎస్ఆర్ ప్రసాద్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీసాయి కళానికేతన్, భువన గాయత్రి నృత్య శిక్షణాలయం విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, ప్రోగ్రాం కన్వీనర్ సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్ రెడ్డి, వి.నాంచారయ్య, పీవీఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఎంవీపీకాలనీ: మద్దిలపాలెం కేఆర్ఎం కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యంపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మునపాటి ఈశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి కేఆర్ఎం కాలనీ శివాలయం వీధిలో నివసిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె స్వప్న డిగ్రీ పూర్తిచేసి టెక్ మహేంద్రలో గతంలో ఉద్యోగం చేసింది. ప్రస్తుతం ఇంట్లోనే ఉంటోంది. స్వప్న మూడు నెలల కిందట తన ఫోన్‌లో వేరే యువకుడితో చాటింగ్ చేస్తుండగా.. తండ్రి చూసి ప్రశ్నించడంతో అతడిని ప్రేమిస్తున్నానని చెప్పింది. ఈ క్రమంలో ఈ నెల 20న సాయంత్రం 4 గంటలకు మేడపై స్వప్న వాకింగ్ చేస్తోందని కుటుంబ సభ్యులు భావించి కొద్దిసేపటి తరువాత వెళ్లి చూడగా.. యువతి కనిపించలేదు. తండ్రి ఈశ్వరరావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళ..

సీతమ్మధార: మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై ద్వారకా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. కొమ్మాది డ్రైవర్స్ కాలనీకి చెందిన పల్లంటి దేవి, తల్లి లక్ష్మితో కలిసి సోమవారం ఉదయం రామాటాకీస్ దరి ప్రభుత్వ కంటి ఆస్పత్రికి వచ్చారు. వైద్య పరీక్షల నిమిత్తం లోపలకు వెళ్లిన దేవి కనిపించలేదు. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ద్వారకా పోలీసులను ఆశ్రయించడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అడంగల్ ట్యాంపరింగ్‌పై చర్యలు తీసుకోండి

- దారపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: విశాఖ రూరల్ మండలం ముడసర్లోవ విలేజ్ దారపాలెంలోని ప్రభుత్వ భూమి అడంగల్ ట్యాంపరింగ్‌పై విచారించి, చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దద్దిమి కోటేశ్వరరావు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. దారపాలెం సర్వే నంబర్ 15/12లో ఉన్న సుమారు మూడు ఎకరాల ఏడు సెంట్ల ప్రభుత్వ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్థానిక అధికారులతో కుమ్మక్కై చట్టం విరుద్ధంగా ట్యాంపర్ చేశారన్నారు. ఆ భూమిని సబ్ రిజిస్టర్, ఎమ్మార్వో రికార్డులో జిరాయితీగా మార్చి ప్లాట్లుగా విభజించి, కోట్లాది రూపాయలు ఆర్జించి.. ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి కొట్టి తమ సొంత జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. ఈ రిజిస్ట్రేషన్‌పై పూర్తి విచారణ జరిపి, బాధ్యులైన వారిని, అధికారులతో సహా గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. దారపాలెంలోని భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనపరుచుకుని దానిపై అనధికారంగా జరిగిన లావాదేవీలను రద్దు చేస్తూ, ఈ భూమిని 22ఏ జాబితాలో కలిపే ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ముడసర్లోవ, దారపాలెం పైనాపిల్ కాలనీలో జరుగుతున్న భూ దందాలను, భూ ఆక్రమణలకు తెరదించి, అక్కడున్న అన్ని ప్రభుత్వ భూములను స్వాధీనపరచుకొని అందులో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పనులు వేగవంతం



అధికారులకు సూచనలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశాఖ సిటీ: మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, వాణిజ్య సముదాయ భవనం, హెలీకాప్టర్ మ్యూజియానికి సంబంధించిన అన్ని పనులను ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అధికారులను ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వాటిని ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం ఈ రెండు ప్రాజెక్టులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన పనులు ఏమైనా మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఈ పర్యటనలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్ఈలు భవానీశంకర్, బలరామరాజు, ఈఈలు మధుసూధన్, రామరాజు, దుర్గాప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విరిగి వెక్కిరిస్తున్నాయి..

- వీఎంఆర్‌డీఏ పార్క్‌లో శిథిలమైన సౌర ఫలకాలు
- ప్రమాదకరంగా వేలాడుతున్నా.. పట్టించుకోని అధికారులు



విరిగి వేలాడుతున్న సౌర ఫలకాలు



వీఎంఆర్‌డీఏ పార్క్‌లో పైకప్పు లేని సౌర ఫలకాలు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన వీఎంఆర్‌డీఏ స్మార్ట్ పార్క్‌లో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. కొన్నేళ్ల కిందట ఈ పార్కును పూర్తిస్థాయిలో ఆధునికీకరించారు. దీనిలో భాగంగా పార్క్‌లో ఏర్పాటు చేసిన పలు వస్తువులు శిథిలమవుతున్నాయి. వీటిని పట్టించుకునే వారు నేడు కరువయ్యారు. ప్రస్తుతం ఇవి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ వీటిపై అధికారులు దృష్టి సారించడం లేదు. వీఎంఆర్‌డీఏ పార్క్‌లో ప్రవేశ మార్గానికి చేరువలో ఒక ప్రత్యేకమైన సిటౌట్ ఏరియాను తీర్చిదిద్దారు. దీనిలో ప్రత్యేకంగా పైపులను ఏర్పాటు చేసి వాటిపై నీలం రంగులో పైకప్పు, సౌర ఫలకాలు ఏర్పాటు చేశారు. కాల గమనంలో ఇవి తుప్పుపట్టి విరిగిపోవడం, పైకప్పునకు వేసిన ప్లాస్టిక్ షీట్ శిథిలమైంది. వీటిని స్థానంలో కొత్తవి వేయడం, ఇనుప పైపులకు రంగులు వేయడం, సౌర ఫలకాల మార్పు చేయడం వంటి చర్యలను అధికారులు చేపట్టడం లేదు. దీంతో ఈ ప్రాంతం అధ్వానంగా దర్శనమిస్తోంది. పొరపాటున ఎవరిపైనైనా ఈ సౌర ఫలకాలు, ఇనుప ప్లేట్లు పడే అవకాశం కూడా ఉంది. వీటికి అవసరమైన మరమ్మతులు చేసి పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సందర్శకులు కోరుతున్నారు.

• తీరం.. కోత భారం



సాగర తీర ప్రాంతంలో తరచూ ఆటుపోట్లు ఏర్పడుతుంటాయి. దీని ఫలితంగా తీరం వెంబడి అనేక ప్రాంతాలు కోతకు గురవుతుంటాయి. పాండురంగాపురం డౌన్ ఎదురుగా ఉన్న సాగర తీరంలో కొద్ది రోజులుగా ఇసుక కోతకు గురవుతోంది. దీనికి సమీపంలోనే డ్రెడ్జింగ్ పనులు సైతం కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. బీచ్ రోడ్డులోని కురుసుర సబ్‌మెరైన్ వెనుక భాగంలో ఇసుక కోతను నివారించే చర్యలు వేగంగా చేస్తున్నారు. దీనికి సమీపంలోనే ఉన్న ఈ ప్రాంతంలో ఇసుక కోతకు గురవడం మనం గమనించవచ్చు. తీరంలో ఎప్పుడు ఏం జరుగుతుంతో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. వీటికి పర్యావరణ వేత్తలు పరిష్కారం చూపాల్సిన అవసరముంది.

- ఏయూక్యాంపస్